తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తాండూరు రూరల్, ఏప్రిల్ 15 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరంలోపు అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తాండూరు ఎంపీపీ అనితాగౌడ్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలను శాఖల వారీగా అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. పాఠశాల్లో మౌలిక సవతుల కల్పనకు రూ.2.33 కోట్లు మంజూరైనట్లు ఎంఈవో వెంకటయ్యగౌడ్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ నిధులను మరుగుదొడ్లు , మూత్రశాల మరమ్మతులకు, తాగునీటి వసతి ఏర్పాటుకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఫార్మేషన్ రోడ్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఫాంపాండ్స్ కూడా నిర్మించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలని కో ఆప్షన్ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ స్వరూప మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలపై అప్పటి కప్పుడు స్పందించి పరిష్కరించాలని సూచించారు.

పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామా ల్లో తాగునీటి వసతి కల్పించేందుకు ప్రతి గ్రామానికి బోర్లు వేయించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా పశువులకు, మనుషులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, అధికారులు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితాగౌడ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గ్రామ సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, బుగ్గమ్మ, సీసీ యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు యాసంగిలో పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలని సూచించారు. క్వింటాలు ధాన్యానికి రూ.2203లు ప్రభుత్వం చెల్లిస్తుందని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం బాగా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. గ్రామ సంఘం కార్యదర్శి అంబుజ, వీఓఏ వెంకటయ్య, సభ్యురాలు శకుంతల పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాల అభివృద్ధి పనులు

సమావేశంలో మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పెంటయ్య

కులకచర్ల, ఏప్రిల్ 15 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయనున్నట్లు బండవెల్కిచర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పెంటయ్య తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల కమిటీ ద్వారా వివిధ పనులను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులను కమిటీ ద్వారా చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ అలివేణి, సీసీ మంజూల, ఉపాధ్యాయులు, కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

పెద్దేముల్, ఏప్రిల్ 15 : మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కోరం లేక వాయిదా వేసినట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో జర్నప్ప ప్రకటించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశానికి కేవలం ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎంపీపీ అనురాధా రమేశ్ అనుమతితో మండల ఇన్‌చార్జి ఎంపీడీవో జర్నప్ప మధ్యాహ్నం 12.30 వరకు సమావేశాన్ని వాయిదా వేశారు. తరువాత కూడా కేవలం ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మధులత,మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ధన్‌సింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ఉపాధి కూలీలకోసం ఏర్పాటు చేసిన షెడ్, తాగునీటి వసతి

పెద్దేముల్, ఏప్రిల్ 15 : మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జి ఎంపీవో,కందనెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేశ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కందనెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో భాగంగా షెడ్ , తాగునీరును ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ ఎక్కువ ఉన్న సమయంలో షెడ్ నెట్ కింద కాసేపు సేదదీరి ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కులకచర్ల, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సాల్వీడ్, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారుల నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ఏ రకానికి రూ.2203, బీ గ్రేడ్ రకానికి రూ. 2183 నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీలు, వీవోఏలు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కొడంగల్, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఎఫ్‌వో టీ. ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాద నివారణోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ ప్రాంగణంలో ప్రయాణికులకు ఫైరింజన్ ప్రయోజనాలు, ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది మతిన్, ఆనంద్, భీమ్‌రెడ్డి, మోతీలాల్, భానుప్రసాద్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

బషీరాబాద్, ఏప్రిల్ 15 : అపహరణకు గురైన ఏడు ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తుల ఫోన్లు అపహరణకు గురికావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. టెక్నాలజీ సహాయంతో ఫోన్లను వెతికి పట్టుకున్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్దేముల్, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని కందనెల్లి తండా సమీపంలోని యాడీ బాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం ఆవరణలో ఈ నెల 17న జాగో బంజారా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'భారత్ బంజారా ధర్మరక్షణ జాగృతి సందేశ్ సభను విజయవంతం చేయాలని కోరుతూ కేంద్రం వ్యవస్థాపకులు శ్రీ రామావత్ సురేందర్ నాయక్ మహరాజ్ సోమవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా సురేశ్‌రాజ్

బొంరాస్‌పేట, ఏప్రిల్ 15 : దుద్యాల మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా భోగమోని సురేశ్‌రాజ్‌ను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా సురేశ్ రాజ్‌ను మాజీ ఎమ్మెల్యేతో పాటు దుద్యాల, బొంరాస్‌పేట మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు చాంద్‌పాషా, కోట్ల యాదగిరి, పార్టీ నాయకులు బాబర్, మహేందర్‌రెడ్డి అభినందించారు.

జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

వీర్లపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో అంజిరెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 15: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఏపీవో అంజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వీర్లపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి జాతీయ ఉపాధి హామి పనులను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం ఏడుగంటల నుంచి 12 గంటల వరకు పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాలన్నారు. టీఏ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, ఎఫ్ఏ వెంకట్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినతి

వికారాబాద్, ఏప్రిల్ 15 : దళితుడైన సుదర్శన్ చావుకు కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ధారూర్ మండలం హరిదాసు పల్లి గ్రామానికి చెందిన సుదర్శన్ చావుకు కారణం అయిన నిందితులను అరెస్ట్ చెయ్యాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయాల ముందు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రవికుమార్, కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, పుష్ప, మృతుడి కుటుంబ సభ్యులు రాజు, కృష్ణ, మల్లేష్ ,కన్నయ్య, అమృతమ్మ, సుగుణమ్మ, సునిత, ఎల్లమ్మ, బిచ్చమ్మ, పద్మమ్మ,యశోద పాల్గొన్నారు.

వడదెబ్బ తో వ్యక్తి మృతి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 15 : వడదెబ్బతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం బొంరాస్‌పేట మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నందిగామ నర్సింహులు(48) సోమవారం ఉదయం గొర్రెలు మేపడానికి వెళ్లాడు. గ్రామానికి సమీపంలోని పొలాల్లో గొర్రెలు మేపాడు. సాయంత్రం గొర్రెలు ఇంటికి వచ్చినా నర్సింహులు రాకపోయేసరికి కు టుంబ సభ్యులు వెతుకగా కొత్తూరుకు వెళ్లే రోడ్డుకు పక్కన పొలంలో మృతిచెంది ఉన్నాడు.

నేడు రక్తదాన శిబిరం

పరిగి, ఏప్రిల్ 15: ఎస్పీ పి.కోటిరెడ్డి ఆదేశాల మేరకు పరిగి పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపారు.

చెరువులో బోర్లు..

ఇప్పాయిపల్లి చెరువులో బోరు ద్వారా పొలానికి నీటి సరఫరా

కులకచర్ల, ఏప్రిల్ 15 : చెరువులో బోర్లు వేసి పొలాలకు నీటిని సరఫరా చేయడంతో పశువులకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఇప్పాయిపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని ఇప్పాయిపల్లి చెరువులో బోర్లు వేసి పొలాలకు నీటిని సరఫరా చేస్తున్నారని, చెరువులో నీళ్లు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. అలాగే చేపలు కూడా చనిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి చెరువులో బోర్లు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్టలను తవ్వితే కఠిన చర్యలు

జనగాం శివారులోని నాగిరెడ్డి కుంటను పరిశీలిస్తున్న మండల ఇరిగేషన్ ఏఈ నవీన్

పెద్దేముల్, ఏప్రిల్ 15 : చెరువు కట్టను తవ్వితే ఇరిగేషన్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని పెద్దేముల్ మండల ఇరిగేషన్ ఏఈ నవీన్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని జనగాం గ్రామ శివారులోని నాగిరెడ్డి కుంట చెరువును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని జనగాం గ్రామ శివారులోని నాగిరెడ్డి కుంట చెరువు కట్టను, తూమును, అలుగును కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా ధ్వంసం చేశారని తమ దృష్టికి రావడంతో చెరువును పరిశీలించినట్లు తెలిపారు. తమ పరిశీలనలో కొంతమంది వ్యక్తులు చెరువు కట్టను తవ్వి చదును చేసినట్లు గుర్తించామన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, రైతులు దస్తప్ప, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత

మంచాల, ఏప్రిల్ 15 : అస్మత్‌పూర్ గ్రామంలో ఐపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతకు ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి సూపర్ కింగ్స్ జట్టుకు రూ. 25 వేలు, రెండో బహుమతి డేంజర్ బుల్స్ జట్టుకు రూ. 15 వేల నగదు,ట్రోఫీని అందజేశారు. అదేవిధంగా మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్ నౌసు సాయి కుమార్‌కు రూ. 5 వేలను హరిప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నౌసు హరి ప్రసాద్, నాయకులు కాళ్ల నర్సింహ, ఎడ్ల గణేశ్, కురిగిల్ల జంగయ్య, జంగయ్య, మాదం శ్రీకాంత్, కాళ్ల జయ పసాద్, నౌసు అనీల్ కుమార్, శివ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కులకచర్ల, ఏప్రిల్ 15 : యువత క్రీడల్లో రాణించాలని బ్లాక్ 2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సాహం అందిస్తానని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంటు నిర్వాహకులు కృష్ణ, రాములు, ప్రభాకర్, రాజు, గోవర్ధన్‌రెడ్డి, రాజు, నూరోద్దీన్, రమేశ్, నర్సింహులు, నరేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న కర్రె భరత్‌కుమార్

కరెంటు సరఫరాలో అంతరాయం

పరిగి, ఏప్రిల్ 15: పరిగి మండలంలోని రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మ తు పనుల వల్ల 16వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మండలంలోని రంగంపల్లి, ఇబ్రహీంపూర్, గడిసింగాపూర్, షోండే పూర్, సాలిప్పలబాటతాండ, పరిశ్రమలకు విద్యు త్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖాజా తెలిపారు. ఈ విష యాన్ని విద్యుత్ వినియోగదారులు గమ నించాలని ఆయన సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కల్వర్టును ఢీకొన్న బైకు..వ్యక్తి మృతి

ఆదిబట్ల, ఏప్రిల్ 15 : కల్వర్టును ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన బంగారి ప్రసాద్(30) మీర్‌పేట్‌లో క్యాటరింగ్ పని చేసేవాడు. అనంతరం తన అత్తగారింటికి (కుర్మల్‌గూడ) వెళ్లి పల్సర్ బైక్‌పై తిరిగి వస్తుండగా కర్మల్‌గూడలోని ఎంవీఆర్ కళాశాల వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు ఢీకొంది. పక్కనే ఉన్న కాల్వలో పడి ప్రసాద్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొంతమంది చూసి 108కి సమాచారం అందించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 15: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖ విస్తరణాధికారి శ్రవణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళారులకు విక్రయించి మోస పోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణ యించిన మద్దతు ధర మేరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దండుమైలారం, పోల్కంపల్లి, రాయపోల్, ఇబ్రహీంపట్నం, ఎలిమినేడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినందున రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని కోరారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదిబట్ల, ఏప్రిల్ 15 : పేకాట స్థావరంపై మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు ఆదిబట్ల పోలీసులతో కలిసి సోమవారం సాయంత్రం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, ప్లేకార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మన్నెగూడ యన్ఎస్ఆర్ ఎన్ కాలనీలో ఓ ఇంట్లో కొంతమంది పేకాడుతున్నారన్న సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ బృందం దాడి చేసింది. దాడిలో మన్నెగూడకు చెందిన వెంకటేశ్వర్లు, ఉప్పల్‌కి చెందిన బాబురావు, తుర్కయాంజాల్‌కు చెందిన సురేందర్, సుబ్బారావు, మన్నెగూడకు చెందిన ఏడుకొండలు, భుజంగరావు, రాగన్నగూడకు చెందిన కుంచాల అంకమరావు కలిసి ఓ ఇంట్లో పేకాడుతున్నారు. సమాచారంతో పోలీసులు దాడి చేశారు. రూ 20,440, ఏడు సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962